## క్లుప్తంగా

### వ్యాధినిరోధక టీకా కేంద్రాల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

**లక్సెట్టిపేట:** మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గుళ్లకోట, ఇటిక్యాల ఉప కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకా కేంద్రాలను బుధవారం డివిజన్ ఆరోగ్య అధికారులు సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లకు పలు సూచనలు చేశారు. టీకాలు ఇచ్చిన వివరాలను ఎప్పటికప్పుడు యూవీన్ పోర్టల్‌లో పొందు పరుచాలని సూచించారు. ఇందులో శాంతకుమారి, ఏఎన్‌ఎంలు కవిత, విజయదర్శిని ఉన్నారు.

### ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

**చెన్నూర్:** పట్టణంలోని నల్లగొండ పోచమ్మవాడ ఉన్నత పాఠశాలకు మంచిర్యాలకు చెందిన స్వర్గీయ అడువాల రాజేశం, రాధమ్మల జ్ఞాపకార్థం, ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్, హెల్పింగ్ హాండ్స్‌ల ఆధ్వర్యంలో అడువాల మోహన్ రూ.25వేల విలువ గల సౌండ్ సిస్టాన్ని అందజేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్కే ప్రసాద్ తెలిపారు.

### ఉత్సవాల్లో డీజేలు వాడితే చర్యలు

**కోటపల్లి:** వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్‌శాఖ నిబంధనల మేరకు వినాయకచవితి వేడుకల్లో డీజేను నిషేధించామని, ఎక్కడైనా డీజేలు వాడితే వాటిని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలువురిని తహసీల్దార్ మహేందర్ ఎదుట బైండోవర్ చేశారు. ఎస్సై సురేశ్ ఉన్నారు.

### ఆరోగ్య విద్యపై అవగాహన

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) మంగళవారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య విద్యపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వో రామ్మూర్తిలు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం అనే అంశాలపై వివరిస్తూ కీటక జనిత వ్యాధులపై తెలియజేస్తూ దోమల రకాలు, దోమలు ఉత్పత్తి చెందే ప్రదేశాలు, దోమకాటుతో వచ్చే వ్యాధులు, దోమల నివారణకు తీసుకోవాలిస్న జాగ్రత్తలపై అవగాహన కలిపించారు. ఏఎన్‌ఎంలు మానస, సుజాత, ఉపాధ్యాయులు వాసవి, నిర్మల, విరూష, అభిసారిక, ఆశా కార్యకర్త పద్మ ఉన్నారు.

### సైనికుల్లా పని చేయాలి

**వేమనపల్లి:** బీజేపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సైనికుల్లా పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ గ్రామ గ్రామానా బూత్ కమిటీలున్నాయని, పార్టీ బలంగా ఉంటేనే అధికారంలోకి వస్తామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, మల్లేష్, ఉపాధ్యక్షుడు ఏట మధుకర్, భీమేష్, వెంకటేష్, సుధాకర్ ఉన్నారు.

### బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

**తాండూర్:** మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన ఇరువురు ప్రధానోపాధ్యాయులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వాసాల ప్రభాకర్ చింతగూడకు బదిలీ కాగా అతడి స్థానంలో ఎస్.మల్లేశం తంగళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. తాండూర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోఫాధ్యాయురాలు ప్రేమలత ఉర్దూ మీడియం పాఠశాలకు బదిలీ కాగా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తాండూర్ జడ్పీ హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. కొత్తగా బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు తీసుకోగా వీరికి పలువురు ఉపాధ్యాయులు శాలువ కప్పి అభినందించారు.

### బ్యాగులు పంపిణీ

**దండేపల్లి:** మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వెర్రబెల్లి ఫౌండేషన్ ద్వారా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రిన్సిపల్ అనీలా, బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, స్థానిక ఎంపీటీసీ అమృత, నాయకులు రవి, సత్యనారాయణ, కిషన్, నర్సింగ్, లక్ష్మీనారాయణ, రాకేష్, హరీష్ ఉన్నారు.

# డంప్‌యార్డుగా శ్మశానవాటిక

- ఆనవాళ్లు లేకుండా పోతున్న సమాధులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


గురిజాలకు వెళ్లే దారిలోని శ్మశానవాటిలోని సమాధులపై పారబోసిన చెత్త

**బెల్లంపల్లి:** సృష్టిలో మనిషి పుట్టుకంతటి మంచి పుట్టుక లేదు. పుట్టిన ప్రతీ వ్యక్తి గిట్టక తప్పదు. మనిషి మరణాంతరం కుటుంబ సభ్యులకు జీవితాంతం గుర్తుండే ఏకైక ఆత్మీయ అనుబంధం సమాధి. మృతుల తీపి జ్ఞాపకాలను, అనుబంధాన్ని, కుటుంబీకులు సమాధుల రూపంలో చూసుకోవడం అనాధిగా, ఆనవాయితీగా వస్తున్న ఓ సంప్రదాయం. ప్రేమతో కట్టించిన సమాధిని అపురూపంగా చూసుకుంటారు. ఆరాధిస్తారు. ఏటా క్రమం తప్పక సమాధికి రంగులు వేసి మరణించిన రోజు, దీపావళి ఇతర సందర్భాల్లో ఇంటిల్లిపాది దీపాలు వెలిగించి టపాసులు కాల్చి మృతుడి జీవి సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తారు. మరణించిన వ్యక్తి సమాధిపై కుటుంబీకులు, బంధువులు అంతగా అనుబంధాన్ని పెంచుకుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన సమాధులపై చెత్తకుప్పలు పారబోసి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. కనీస మానవత్వం లేకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**ఇదీ బెల్లంపల్లి బల్దియా దుస్థితి..**

ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీకి డంప్‌యార్డు లేదు. 34వార్డులు ఉన్న మున్సిపాలిటీలో డంప్‌యార్డు సమస్య తీవ్రంగా ఉంది. కన్నాలబస్తీ శివారు సర్వే నెంబర్ 170లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.కోటికి పైగా వ్యయం చేసి డంప్ యార్డు దశాబ్దకాలం క్రితం ఏర్పాటు చేసిన సంతోషం అనతికాలంలోనే ఆవిరైంది. ఆ ప్రాంతంలో 355.03 ఎకరాల విస్తీర్ణంలో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో డంప్ యార్డును అనివార్యంగా ఎత్తివేయాల్సి వచ్చింది. దాదాపు మూడేళ్ల కాలం దగ్గర పడుతున్నా ఇంత వరకు కొత్తగా ఏ చోట డంప్ యార్డు ఏర్పాటు చేయలేదు. ఏ ప్రాంతంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడే చెత్తను టన్నులకొద్ది డంప్ చేస్తున్నారు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అనే తేడా లేకుండా మున్సిపాలిటీలోని శివారు ప్రాంతాలను అనధికారికంగా డంప్ యార్డుగా మార్చేశారు.

**గురిజాలకు వెళ్లే రహదారి పక్కనే...**

డంప్ యార్డు సమస్య తలెత్తడంతో కొన్ని నెలల నుంచి గురిజాలకు వెళ్లే మార్గంలో ఉన్న శ్మశానవాటికను ఎంచుకున్నారు. ఈ ప్రాంతంలో వందలకొద్ది సమాధులున్నాయి. చెత్తను ట్రాక్టర్లలో తీసుకువచ్చి సమాధులపై పోస్తున్నారు. ఎవరైనా అడిగితే ఎక్కడ వద్దంటున్నారు మరెక్కడ చెత్తను డంప్ చేయాలో చెప్పండని మున్సిపల్ అధికారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, ఇతర పాలకవర్గ సభ్యులు వంత పాడుతున్నారనే విమర్శలున్నాయి.

**సమాధులను చెత్తతో కప్పేయడం దారుణం**



మృతుల తీపి గుర్తులను ప్రతీ కుటుంబం సమాధుల రూపంలో చూసుకుంటుంది. అంతటి జ్ఞాపకాలను గుర్తు చేసే సమాధులను పవిత్రంగా భావిస్తాం. మున్సిపల్ అధికారులు శ్మశాన వాటికను ఏకంగా డంప్ యార్డు చేశారు. ఈతీరు అత్యంత దారుణం. వెంటనే సమాధులపై చెత్త పారబోయకుండా నివారణ చర్యలు తీసుకోక పోతే ఆందోళనలు చేపడతాం.

– కోడి రమేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, బెల్లంపల్లి

**మరోచోట డంప్ యార్డు ఏర్పాటు చేయాలి**



డంప్ యార్డును ఎవరికీ అభ్యంతరం లేని ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందుకు అనువైన ప్రాంతాన్ని మున్సిపల్ అధికారులు గుర్తించాలి. అంతేకానీ స్థలాన్ని గుర్తించకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారబోయడం సరైందికాదు. సమాధుల మీద చెత్త పారబోసి వ్యక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా వ్యవరించడం మానుకోవాలి. ప్రభుత్వ భూములు అపారంగా ఉన్న బెల్లంపల్లిలో మున్సిపల్ డంప్ యార్డుకు స్థల సమస్య రావడం విడ్డూరంగా ఉంది.

– కటకం సతీశ్‌కుమార్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, బెల్లంపల్లి

# అధికారివా.? బీఆర్‌ఎస్ కార్యకర్తవా.?

- వివాదాల నడుమ ముగిసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఏపీఎం తీరుపై ఎంపీటీసీ, సర్పంచుల వాగ్వాదం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** నువ్వు ప్రభుత్వ అధికారివా.? బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తవా.? అంటూ ఐకేపీ ఏపీఎం తీరుపై కాంగ్రెస్ ఎంపీటీసీ, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో జరిగిన పురోగతిని వివరించాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో అధికారులు తమకు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అందరితో సమన్వయంగా చూడాలని కోరారు. ఇకపై అలా జరగదని ఎంపీడీఓ అబ్దుల్‌హై కోరడంతో సభ ముందుకు సాగింది. గ్రామాల్లో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న అనధికార లేఅవుట్లపై ఫిర్యాదు చేస్తున్నా ఎంపీవో స్పందించడం లేదన్నారు. రెండు నెలల క్రితం నిర్వహించిన బీఆర్‌ఎస్ ర్యాలీలో ఐకేపీ సిబ్బంది కండువాలతో పాల్గొనేలా ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్ మెస్సేజ్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి వత్తాసు పలకడం శోచనీయమన్నారు. వారినుంచి సరైన సమాధానం రాకపోవడంతో కాంగ్రెస్ ఎంపీటీసీ, సర్పంచులు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. అనంతరం అధికార పార్టీ ఎంపీటీసీ, సర్పంచులతో మమ అనిపించి ముగించేశారు. వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీపీ కో ఆప్షన్ ఎం.డీ.రఫీక్, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

# సార్.. కరెంట్ ఏఈ కావాలే..!

**జైపూర్:** అసలే పెద్ద మండలం.. తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతూనే ఉంటాయ్.. ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తినా టక్కున ట్రాన్స్‌కో ఏఈకి ఫోన్ కోడ్తాం. ఇక రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సమస్యలు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. అలాంటిది జైపూర్ ట్రాన్స్‌కో ఏఈ అనారోగ్య కారణంతో కొంతకాలం సెలవుపై వెళ్లాడు. ఆయన స్థానంలో చెన్నూర్‌రూరల్ ఏఈ భాస్కర్‌కు ఇన్‌చార్జిగా ఇచ్చినప్పటికీ పెద్ద మండలం కావడం ఆయన రెండు మండలాలను చూసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఆయన తప్పుకున్నాడు. మళ్లీ ఇక్కడ సబ్ ఇంజినీర్‌గా పని చేసిన వ్యక్తికే ఎట్టకేలకు ఇన్‌చార్జి ఇచ్చినప్పటికీ ఇదంతా కలనొప్పిగా భావించి అతడు సైతం సెలవు పెట్టారు. దీంతో మండలంలో విద్యుత్ సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. రెగ్యులర్ ఏఈ ఎప్పుడోస్తాడని రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు

**కాసిపేట:** మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ గురువాపూర్‌లో సుమారు 50మంది పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో పలువురు చేరుతున్నట్లు తెలిపారు. సోనియగాంధీ ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.15వేలు కౌలురైతులకి సైతం ఇవ్వడం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లాంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, నాగవత్ రాము, మారం సురేష్ ఉన్నారు.

# గిరిజన గూడేల్లో మెడికల్ క్యాంపులు

సాక్షి ఎఫెక్ట్..


నాయకపుగూడలో పరీక్షిస్తున్న వైద్యులు

**కాసిపేట:** ఆదివాసీ గూడేల్లో జ్వరాల విజృంభన.. తల్లడిల్లుతున్న గిరిజన గ్రామాలు అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బుధవారం గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. వైద్యాధికారి రవికిరణ్, ఎంపీడీవో ఎంఏ అలీం ఆధ్వర్యంలో మండలంలోని దేవాపూర్ నాయకపుగూడ, సోనాపూర్ దొడ్డిగూడ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగానే ఉన్నాయని, ఇళ్లల్లో మాత్రం శుభ్రంగా లేక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రక్తపరీక్షలు చేసి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయని, డెంగీ అని రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. డెంగీ నిర్ధారించే అర్హత వారికి లేదని, అమాయకులను భయభ్రాంతులకు గురిచేసి సొమ్ము చేసుకుంటున్న వైనంపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కవిత ఉన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు


దండేపల్లి: సమస్యలు వివరిస్తున్న గ్రామస్తుడు

**దండేపల్లి:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం కొర్విచెల్మ–కొమ్ముగూడ గ్రామాల మధ్య ఒర్రెపై రూ.1.58 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించిన వంతెనను బుధవారం ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి, వెల్గనూర్, కొండాపూర్, పెద్దపేట, కర్ణపేట, తానిమడుగు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. రైతు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్‌ఎంపీపీ పసర్తి అనిల్, ఎంపీటీసీ రాజన్న పాల్గొన్నారు.

**పనులు పూర్తికాకున్నా ప్రారంభోత్సవాలు..?**

కొర్విచెల్మ–కొమ్ముగూడ గ్రామాల మధ్య ప్రవహించే ఒర్రెపై రూ.1.58 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ పనులు పూర్తికాలేదు. ఎమ్మెల్యే హడావిగా వంతెనను ప్రారంభించడంపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అప్రోచ్ పనులపై పీఆర్‌ఏఈఈ తివారీని సంప్రదించగా వర్షాలతో పనులు పూర్తిచేయలేదన్నారు.

**సమస్యల ఏకరువు..**

మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. సమావేశంలో పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణ పనులపై ఎందుకు దృష్టి సారించడం లేదని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు రాజకీయం గురించి మాట్లాడం కొసమెరుపు.

**హెల్త్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**లక్సెట్టిపేట:** మండలంలోని కొత్తూరు గ్రామంలో రూ.20లక్షలతో మంజూరైన హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేసి మాట్లాడారు. పల్లెవాసుల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సర్పంచ్ సురేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు రమేశ్, జేఈ బషీర్, నాయకులు శంకరయ్య ఉన్నారు.

# గడపగడపకూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు


పథకాలను వివరిస్తున్న నాయకులు

**రామకృష్ణాపూర్:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణలో త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికి వెళ్తూ నాయకులు వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు నూకల రమేష్, లాడెన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అధికారంలోకి రాగానే పథకాల అమలు**

**చెన్నూర్‌రూరల్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పథకాలు అమలు అవుతాయని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ అన్నాడు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీధర్, అంకాగౌడ్, శ్రావణ్, నరేష్ ఉన్నారు.

### నిత్యావసర సరుకులు పంపిణీ

**నెన్నెల:** మండలంలోని మన్నెగూడం, కుశ్నపల్లి గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలైన రాంటెంకి అశ్విని, ఎల్లూరి భీమక్క, ఎల్లూరి లాంచయ్యలను బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నాతరి స్వామి బుధవారం పరామర్శించారు. అనంతరం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాంయాదవ్, డీసీసీ సభ్యుడు గట్టు బానేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్, నెన్నెల మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహిద్‌ఖాన్, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**బెల్లంపల్లి:** ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బెల్లంపల్లిలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు రాస్తారోకో చేశారు. సామూహికంగా తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు కాంటా చౌరస్తా వద్ద రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకుని కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి మల్లారపు చిన్నరాజం మాట్లాడారు. నాయకులు కె.రాజలింగు, గోగర్ల శేఖర్, రత్నం ఐలయ్య పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి**

**కోటపల్లి:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండల ఇన్‌చార్జి చెన్నూరి శ్రీనివాస్‌మాదిగ, నాయకులు రవీందర్, విష్ణు, సంపత్, శ్రీనివాస్, జయరాం, రాజేశ్, పురుషోత్తం ఉన్నారు.

**పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి**

**చెన్నూర్:** ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే దీక్షలకు టీడీపీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ అన్నారు.మద్దతు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

**బతుకమ్మ చీరెల పంపిణీ**

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం కొక్కిరాల రఘుపతిరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బతుకమ్మ చీరెలను మహిళలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, ట్రస్ట్ చైర్మన్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు రజిత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీటీసీ బాపు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సురేందర్ పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో చీరెల పంపిణీ**


చీరెలు అందిస్తున్న మాజీ ఎంపీ వివేక్

**మందమర్రిరూరల్:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మహిళలకు చీరెలను పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి మహిళల అభ్యున్నతిపై చిత్తశుద్ధి ఉందన్నారు. నాయకులు శ్రీనివాస్, నరేష్, రమేష్, దీక్షితులు, దుర్గరాజ్ ఉన్నారు.

**బీఎస్పీ మండల అధ్యక్షుడిగా యాకూబ్**

**మందమర్రిరూరల్:** మందమర్రి మండల బీఎస్పీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహమ్మద్ యాకూబ్ ఎంపికయ్యారు. బుధవారం పట్టణంలోని బీఎస్పీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ యాకూబ్‌కు నియామక పత్రం అందించారు.

**మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి**

**జైపూర్:** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి తాగినా, గంజాయి రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మండల కేంద్రంతో పాటు నర్వ, తదితర గ్రామాలకు చెందిన పలువురి యువకులు మత్తుపదార్థాలకు అలవాటుపడినట్లుగా గుర్తించి వారికి జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగా తెలిపారు. పలువురి యువకులను స్థానిక తహసీల్దార్ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

**పొదుపు పథకాలతో భరోసా**

**తాండూర్:** గ్రామీణులు పోస్టాఫీసు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి సబ్ డివిజన్‌పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సతీష్ సూచించారు. బుధవారం తాండూర్ పోస్టాఫీసులో జరిగిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**పశుగర్భకోశ చికిత్స**

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీలోని అమరవాది, శేషుపల్లి గ్రామాల్లో బుధవారం ఉచిత పశుగర్భకోశ చికిత్స నిర్వహించారు. 16మంది రైతులకు సంబంధించిన 33 గేదెలకు, ఆవుకు గర్భకోశ చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. 23దూడలకు నట్టల మందులు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వసీమ్, డాక్టర్ శంకర్‌లింగం, వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రవి, శ్రీనివాస్, చెన్నయ్య పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలపై అవగాహన**

**మందమర్రిరూరల్:** నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి సూచించారు. బుదవారం సైకిల్‌పై ఊరు రామకృష్ణాపూర్ వెళ్లిన సీఐ పలువురిని కలిసి అవగాహన కల్పించారు.

**కాసిపేట–2 గనిలో రక్షణపై..**

**కాసిపేట:** మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై బుధవారం నా రక్షణ నా బాధ్యత నా కుటుంబ భద్రత అంశంపై రక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే.హెచ్.ఎస్.గుప్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు భద్రత అనేది ఇంటి వద్ద నుంచే మొదలవ్వాలని సూచించారు. సీమ్‌టార్స్ ఇన్‌చార్జి జీవీఎస్ విజయ్‌కుమార్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఫిట్ కార్యదర్శులు కారుకూరి తిరుపతి, వెంకటేష్ ఉన్నారు.


**ఈవీఎంలపై అవగాహన**

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ మేనేజర్ విజయ్ కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్ పాల్గొన్నారు.

**టీచర్‌ను బదిలీ చేయవద్దు**

**కాసిపేట:** ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో తమ ఉపాధ్యాయురాలిని బదిలీ చేయవద్దని మా టీచర్ మాకే కావాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను వేడుకుంటున్నారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లలకు మంచి ఫలితాలు రావడంతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్న తమ పిల్లలను సైతం ప్రభుత్వ పాఠశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు జాడి సతీష్, రామటెంకి కృష్ణ, కుమ్మరి సంతోష్, వనజ, సురేష్ పాల్గొన్నారు.

**ఆర్‌కేపీలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్'**


మాట్లాడుతున్న ఏసీపీ

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో బుధవారం సాయంత్రం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజశేఖర్, చంద్రకుమార్, గంగారాం పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి


రఘుపతి (ఫైల్)

**భీమారం:** మండల కేంద్రంలోని లంబాడీ తండాకు చెందిన బానోత్ రఘుపతి (42) బుధవారం రాత్రి విత్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వర్షం పడుతున్న సమయంలో ఇంట్లో బట్టలు ఆరబెట్టేందుకు ఇనుపతీగ (దండెం)పై వేస్తుండగా దానికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, కుమారుడు దేవేందర్, కుమార్తె శైలజ ఉన్నారు. విచారణ చేసి మృతుడి కుటుంబ సభ్యులకు పరిహారం అందిస్తామని విద్యుత్ శాఖ ఏఈ కుమార్ తెలిపారు.

### దుగ్నెపల్లిలో పోషణమాసోత్సవం

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలోని ఒకటి, రెండవ, మూడవ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు ఏ విధమైన పౌష్టికాహారం తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్న మంజుల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరికరాల రజిత,అంగన్‌వాడీ టీచర్లు పద్మ, హేమలత, శ్యామల పాల్గొన్నారు.